క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



కురవి: మండల కేంద్రంలో బీటీ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించడంతో కురవి గ్రామ రైతులు, ప్రజల చిరకాల వాంఛ నెరవేరడంతో రైతులు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌ను ఆదివారం శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ కోఆర్డినేటర్ బెడద వీరన్న, ఎంపీటీసీ చిన్నం భాస్కర్, వార్డు సభ్యులు నూతక్కి నర్సింహారావు, ఆమెడ మల్లికార్జున్, నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, తోటలాలయ్య, గుగులోత్ రవి పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

గార్ల: గార్ల పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు సీఎం కేసీఆర్ రూ.15కోట్లు నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆదేశాల మేరకు ఆదివారం గార్లలో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీపీ శివాజీచౌహాన్, సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, తారాబాయి, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, కోఆప్షన్ ఎండి ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేతపై విచారణ

కేసముద్రం: మండల కేంద్రంలోని రాధాస్వామి మందిరం ప్రహరీని కూల్చివేయడంపై పలురకాలుగా ప్రచారం సాగుతుండడంతో వివాదాస్పదంగా మారింది. ఈమేరకు ఆదివారం రెవెన్యూ అధికారులు రాధాస్వామి మందిరం వద్దకు చేరుకుని, కూల్చివేతను పరిశీలించారు. కాగా మందిరం చుట్టూ ప్రహరీ శిథిలావస్థకు చేరడంతో కూలే పరిస్థితి ఉందని, పైగా పిచ్చి మొక్కలు పెరగడంతో విషపు పురుగులు తిరుగుతుండడంతో గోడను కూల్చివేసినట్లు తెలిసిందని ఆర్‌ఐ బాబు తెలిపారు. కాగా ట్రస్టు చైర్మన్ వోలం చంద్రమోహన్ మాట్లాడుతూ.. రాధాస్వామి మందిరం గోడ శిథిలావస్థకు చేరడంతో రోడ్డువైపు ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో కూల్చామన్నారు. మందిరం ఆస్తులను కాపాడుకునేందుకు సొసైటీ ఏర్పాటు చేశామన్నారు. ఇట్టి భూమి ఆక్రమణకు గురికాకుండా చూస్తామని, కూల్చిన గోడ స్థలంలో వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

చెక్కు పంపిణీ

కొత్తగూడ: మండలంలోని దుర్గారం చిన్నతండాకు చెందిన దేవేందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి రూ.1.25లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు, నాయకులు ఈసం స్వామి, నెహ్రూ, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



గూడూరు: మండలంలోని తీగలవేణిలో ఆదివారం తెలంగాణ అమరవీరుడు ధారావత్ శ్రీనునాయక్ తండ్రి సోమ్లానాయక్ (63) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెల్సుకున్నఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, ఎంపీటీసీ వేం వాసుదేవరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల్లో పాడెను మోసి ప్రాగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సీతానగరంలో మృతిచెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి, ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటక్రిష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లియాఖత్ అలీ వర్ధంతి



కురవి: హక్కుల పోరాడే నాయకులు ఎల్లప్పుడు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా నాయకుడు ఎండీ లియాఖత్ అలీ వర్ధంతి వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజన్న, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, వెంకన్న, సారయ్య పాల్గొన్నారు.

ఆరోపణ అబద్ధం

నెల్లికుదురు: ఊరిలో నీటి సమస్య లేదని, నీటిలో పురుగులొస్తున్నాయని గ్రామానికి చెందిన ఒకటో వార్డు సభ్యుడు నవీన్‌రెడ్డి చేసిన ఆరోపణ అబద్ధమని ఉపసర్పంచ్ నక్క సాయిలు, గ్రామస్తులు శ్రీశైలం, యాకసాయిలు, వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సీతారాంపురంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. బ్లీచింగ్ పౌడర్ అడిగితే పెట్టనందుకు నవీన్‌రెడ్డి నాటకమాడాడని అన్నారు. దీంతో మండల కేంద్రంలో భిక్షాటన చేసిన బ్లీచింగ్ పౌడర్ నల్లాల బావిలో వేయడం అంతా రాజకీయ కుట్ర అని అన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే పూర్తి

- 500 మార్కులతో సర్వే
- గతేడాది జిల్లాకు 19వ ర్యాంకు
- అక్టోబర్‌లో ప్రకటించనున్న ర్యాంకులు



ఆమనగల్ గ్రామంలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు (ఫైల్)

మహబూబాబాద్: జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రం బృందం సర్వే పూర్తైంది. జిల్లా వ్యాప్తంగా 20 జీపీలను ఎంపిక చేసుకుని సర్వే చేశారు. సర్వేలో వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు. గత ఏడాది జిల్లాకు దేశంలో 19వ ర్యాంకు రాగా ఈసారి టాప్ 10లో ఉండే విధంగా సంబంధిత అధికారులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కాగా 86 మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉండగా 364 జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 11మంది అవుట్ సోర్సింగ్‌లో జేపీఎస్‌లు పని చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రం బృందం పది లక్షలలోపు 20జీపీలలో పది లక్షల జనాభా కంటే ఎక్కువ ఉంటే 26జీపీలలో రాన్‌డమ్‌గా గ్రామాలలో సర్వే చేశారు. జిల్లాలో ఈనెల 6నుంచి బృందం సభ్యులు పర్యటించారు. కాగా ఈనెల 6, 7వ తేదీలలో మండలంలోని అమనగల్ జీపీ, పెద్ద గూడూరులో అయోధ్యపురం, కేసముద్రం మండలంలో కేసముద్రం విలేజ్, బేరువాడ, చిన్నగూడూరులో ఉగ్గంపల్లి, విస్సంపల్లి, దంతాలపల్లిలో ఆగపేట, వాల్యా తండా జీపీ, డోర్నకల్ మండలంలో చిల్కోడు, హున్యా తండా జీపీ, కురవిలో మొదుగులగూడెం, గాజతండా జీపీలలో బృందం సభ్యులు పర్యటించారు. 8వ తేదీన మానుకోట మండలంలోని వేంనూర్, నడివాడ, పర్వతగిరి గ్రామాలతోపాటు మరిపెడ మండలంలో వీరారంజీపీ బృందం సభ్యులు పర్యటించారు. నెల్లికుదురులో రావిలాల గ్రామాలో పూర్తి చేశారు. 9న నర్సింహులపేట మండలంలో నర్సింహులపేట జీపీతోపాటు తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, తర్కల్ జీపీలలో పర్యటించారు. ప్రధానంగా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆమనగల్ జీపీలో టీం సభ్యులు ఇంటింటికి తిరిగి మరుగుదొడ్లు ఇతరత్రా పరిశీలించారు.

500 మార్కులతో సర్వే....

వివిధ అంశాలతో ఉన్న జాబితాలో 500 మార్కులు ఉన్నాయని దాని ప్రకారం మార్కులు చేస్తున్నారని, దాని ప్రకారమే ర్యాంకులు ఉంటాయని, అధికారులు పేర్కొన్నారు. కాగా దానిలో పారిశుద్ధ్యంతోపాటు ఇంకుడుగుంతలు, సెగ్రిగేషన్ షెడ్డులు, తడి చెత్త పొడి చెత్త సేకరణ, గోడలపై వాల్‌పెయింటింగ్‌లు, ట్రాక్టర్ నిర్వహన మరుగుదొడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహన దాని ఆవరణలో పరిసరాలు పరిశుభ్రత లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. గత ఏడాది దేశంలోనే 19వ ర్యాంక్ రావడం మాములు విషయం కాదు. ఈసారి టాప్ 10లో జిల్లా ఉండాలన్నదే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మొదటి, రెండో, మూడో ర్యాంకు వచ్చిన వారికి నజరానా ఉంటుందన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



తొర్రూరు: బైక్‌లపై ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు: జాతీయవాదం, దేశభక్తి భావనలు బీజేపీకే సొంతమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీమాన్, జాయింట్ కన్వీనర్ కోటేశ్వర్, ఆయా మండలాల అధ్యక్షులు కుమార్, సురేష్, రవి పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

గూడూరు: ఈనెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతీ ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలని సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివరాత్రి సంపత్, కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు ఎండి.యాకూపాష, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మండల మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కురవి: బీజేవైఎస్ జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గుడిసెంటర్ నుంచి జాతీయ జెండాలతో బైక్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్‌రావు తిరంగ యాత్రను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, కోఆర్డినేటర్ సంపత్‌రావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవికనాయక్ నాయకులు ప్రభాస్‌నాయక్, పూర్ణచందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక బాలాజీ గార్డెన్‌లో ఆదివారం టీయూ డబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా ద్వితీయ మహాసభను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కూడా జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా జర్నలిస్టులు పని చేస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను వెలికితీయడం వాటి సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు పని చేస్తారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి యుగేందర్, కోశాధికారి శ్రీహరి, యూనియన్ రాష్ట్ర నాయకులు మధు, కృష్ణారెడ్డి, రమణ, వేణు, తదితరులు పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వం

నెల్లికుదురు: ప్రాణాలను లెక్క చేకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని అనతి కాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ కేసీఆర్ ప్రభుత్వం పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్సీ రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ఓ ఇంట్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి ప్రారంభించారు. ఆదివారం గ్రామంలో మంత్రి సత్యవతిరాథోడ్ సీడీఎఫ్ నిధుల నుంచి రూ.15లక్షల విలువైన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగిలిహరిప్రసాద్, వార్డు సభ్యులు బస్వ భవానిఉపేందర్, ఎండీ జాఫర్‌ఖాన్, సాదురాజు, ఆర్‌బీఎస్ కో–ఆర్డినేటర్ బస్వశ్రీనివాస్, నాయకులు అనిల్‌రెడ్డి, బండి రవీందర్‌రెడ్డి, మల్లేష్, ఉపేందర్, ఈర్ల కృష్ణ, రామన్న, వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

వరదలకు దెబ్బతిన్న నర్సరీ మొక్కలు



దెబ్బతిన్న నర్సరీలోని మొక్కలు

గార్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పాకాల ఏరు ఉధృతంగా ప్రవహించడంతో పాకాల ఏటి సమీపంలో ఏర్పాటు చేసిన రాంపురం పంచాయతీ నర్సరీలో మొక్కలు 80శాతం చనిపోవడంతో నర్సరీ పూర్తిగా దెబ్బతిన్నది. హరితహారం పథకంలో రాంపురం పంచాయతీలో మొక్కలు నాటేందుకు వేరే పంచాయతీల్లోని నర్సరీల నుంచి మొక్కలు తీసుకురావల్సిన పరిస్థితి నెలకొంది. ఈనర్సరీలో 2,200 మొక్కలను సంబంధిత అధికారులు పెంచగా, వరద ఉధృతికి నర్సరీలో మొక్కలన్నీ చనిపోయాయి. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నర్సరీలో ఉన్న మొక్కలను కాపాడుకునే ప్రయత్నం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

పాఠశాలల భవనాలు నిరుపయోగం

- విద్యార్థులు లేక మూసివేత
- ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న స్థానికులు



పడమటితండాలో మూతబడిన పాఠశాల



భద్రుతండాలో..


పెద్దవంగర: లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తమ పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి.

మండలంలోని 5 జెడ్పీ పాఠశాలలు, 5ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 ప్రాథమిక పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతోపాటు జ్యోతిరాజజీ పూలే బాలుర పాఠశాలు ఉండగా అందులో 2,194 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా భద్రుతండా, పడమటి తండా, జయరాం తండా, సోమ్లా తండాల్లోని ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. ఇక్కడ విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడం ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపకపోవడంతో మూసివేతకు గురయ్యాయి. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఇప్పుడు నిరుపయోగంగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ ప్రభుత్వ కార్యాకలాపాలకు వినియోగించేలా తగు చర్యలు చేపట్టాలని స్థానికులు పేర్కొంటున్నారు.

ఈ ఏడాది నిరాశ ఫలితాలు..

ఇది ఇలా ఉంటే మండలంలో ఈ ఏడాది పదో తరగతిలో నిరాశ కలిగించే ఫలితాలే వచ్చాయి. గతంతో పోలిస్తే ఎన్నడు లేనంతగా అట్టడుగు స్థానిక పడిపోయాయి. ఈఏడాది 5జెడ్పీ ఉన్నత పాఠశాలల తోపాటు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జ్యోతిరావ్‌పూలే పాఠశాలల్లో సైతం 10జీపీఏ సాధించిన వారు ఒక్కరూ కూడా లేరు. కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల్లో మాత్రం వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

విద్యార్థులు లేక మూతబడ్డాయి..



పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో మూసివేయాల్సి వచ్చింది. మన ఊరు –మన బడి కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేకంగా చొరవ తీసుకున్నాం. అనుకున్నంత విద్యార్థులు పెరగలేదు. మండలంలో నాలుగు తండాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. దీంతో పాఠశాలల భవనాలు నిరుపయోగంగా మారాయి.

– ఇన్‌చార్జ్ ఎంఈఓ రాము, పెద్దవంగర

ఊరూరా ముత్యాలమ్మ బోనాలు



నెల్లికుదురు: బోనాలతో ముత్యాలమ్మ తల్లి వద్దకు వెళ్తున్న మహిళలు



గూడూరుల: ముత్యాలమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండగను ప్రజలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతీ సంవత్సరం శ్రావణమాసంలో గ్రామ పులిమేరల్లో కొలువై ఉన్న ముత్యాలమ్మ తల్లి, బొడ్రాయి విగ్రహాలకు మేళ తాళాల నడుమ బోనాలు సమర్పించారు. నూతన దుస్తులు అమ్మవారికి చూపి, కోళ్లు, గొర్రెలతో తల్లి చల్లంగ చూడమని మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గూడూరు: నాట్యం చేస్తున్న శివసత్తి



కేసముద్రం: అమీనాపురం గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు



నర్సింహులపేట: బోనాలతో వెళ్తున్న మహిళలు



తొర్రూరు రూరల్: గుర్తూరులో బోనంతో ఎర్రబెల్లి ఉషా



బయ్యారం: బోనాలతో వెళ్తున్న మహిళలు



గార్ల: పినిరెడ్డిగూడెం గ్రామంలో..



దంతాలపల్లి: రేపోని గ్రామంలో..



మహబూబాబాద్ రూరల్: బ్రహ్మణపల్లి లక్ష్మీపురం గ్రామంలో..

బియ్యం వితరణ

గార్ల: గార్లలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులు మస్నా ప్రసాద్, కంద్రాతి అన్నపూర్ణలకు గణేష్ యువసేన ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 100కేజీల చొప్పున వితరణ చేశారు. కార్యక్రమంలో యువసేన నిర్వహకులు కట్ట రమేష్, విశాల్‌జైన్, తదితరులు పాల్గొన్నారు.

20న బోనాలు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 20న బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ముత్యాలమ్మ తల్లి ఆలయ ఐదో వార్షిక వేడుకలు ఈనెల 18, 19న జరగనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు బోనాల చెల్లింపు ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో శ్రీనివాస్, రమణ, వెంకన్న, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: మండలం వేములపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో నిరుపేద కుటుంబానికి చెందిన గుండాగాని వెంకన్న మృతి చెందగా. వేములపల్లి, దొనకొండా గ్రామాలకు చెందిన యువకులు ఆదివారం వారికి తోచిన విధంగా డబ్బులు వేసుకొని రూ.18,700 ఆర్థికసాయం చేశారు.

తండాల్లో తీజ్ వేడుకలు



మహబూబాబాద్ రూరల్: గుండ్లబోడు తండాలో..



కేసముద్రం: బడితండాలో..

మహబూబాబాద్ రూరల్: బంజారాల సంస్కృతి సంప్రదాయాల ఆరాధ్య దైవంగా భావించే తీజ్ పండుగ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు గుండ్లబోడు తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్, జాతీయ కోర్ కమిటీ సభ్యులు మోతిలాల్ నాయక్, ఉద్యోగ సేన జిల్లా కార్యదర్శి బన్సీలాల్ నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు. భవానినగర్ తండాలో తీజ్ పండుగ ఉత్సవాలలో అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య పాల్గొని తీజ్ వేదిక వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని శివారు బడితండాలో తీజ్ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, నాయకులు గుగులోతు విజయ్, బాలునాయక్, శక్రు, దేవేందర్, వీరన్న పాల్గొన్నారు.



తీజ్ బుట్టతో చిన్నారి

గార్ల: మండలంలోని పలు పంచాయతీల్లో ఆదివారం బంజారా గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బన్సీలాల్, జ్యోతి, కృష్ణచవాన్, శ్రీను పాల్గొన్నారు.

కళాకారులకు డప్పుల పంపిణీ



కురవి: గిరిజనుల తీజ్ పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ తండాకు కిసాన్ పరివార్ అధినేత భూపాల్ నాయక్ డప్పులను ఆదివారం మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యాతండాలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగన్నగౌడ్, భీమానాయక్, విష్ణునాయక్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో బోనాల పండగా సందర్భంగా ఆదివారం గ్రామంలోని డప్పు కళాకారులకు బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిరాల వీరస్వామి బహూకరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, ఎంపీటీసీ వెంకన్న, ఉప సర్పంచ్ సత్తమ్మ పాల్గొన్నారు.